

# కలర్ ఫోటో

ఇంటికి రాగానే 'అల్లుడింకా రాలేదా? వైజాగు నుంచి రావలసిన బళ్ళన్నీ వచ్చేశాయిగా' అన్నాడు ఉషాబాల "నాన్నగారూ ఆయన ఎల్లుండి వస్తారని ఉత్తరం వచ్చింది''.

"అయితే ఎల్లుండికి పోస్టు పోన్ చేద్దాం ఫోటోని'' అన్నాడు రంగనాథ్. సత్యభామకి కోపం వచ్చి "మీరెప్పుడూ ఇంతే! ఆ మాట పొద్దున్నే చెబితే మాకింత హైరానా ఉండేదా?'' అని మూతి ముడుచు కుంది.

ఉషాబాల "నాన్నగారూ! కావలిస్తే మళ్ళీ ఇంకో ఫోటో పెట్టుకుందాం ఇవాళ కృష్ణకిశోర్ అమ్మ ఒళ్ళో కూచుని ఫోటో తీయించుకు తీరాలి'' అంటూ "అమ్మకి జాజిపూలంటే ఇష్టం. ఒక రెండు మూరలు తేరూ?'' అంది గోముగా.

డ్రస్సు మార్చుకోకుండానే రంగనాథ్ మేడమెట్లు దిగబోతూంటే "ఏమండీ ఈ టీ తీసుకు వెళ్ళండి'' అంటూ సత్యభామ స్కై బ్లూ పట్టుచీరలో ఒయ్యార మొలకబోస్తూ వచ్చి ఇచ్చింది. రంగనాథ్ పై నుంచి కింద దాకా చూస్తూ "దీపావళి దిగివచ్చినట్లుంది. గరుడ వాహనం తీసుకొచ్చేస్తాను ఏకంగా'' అన్నాడు నవ్వుతూ. సత్యభామ కాటుక కళ్ళు పెద్దవయినట్లు చూసి, నవ్వింది.

రంగనాథ్ జాజిపూలకోసమని వెడుతూ దారిలో రెండు రిక్షాల్ని మాటాడి, ఇంటికి పంపేశాడు. తెల్లని వెన్నెల దారాల్లా వేలాడుతున్న జాజిపూల దండలు నాలుగు కొన్నాడు రంగనాథ్.

"ఏం నాలుగు తెచ్చేశారూ? మనమడితల్లో కూడా పెట్టమంటారా? ఒకటి మీరు చేతికి తగిలించు కుంటారా!'' అంది సత్యభామ వ్యంగ్యంగా. రంగనాథ్ ఏదో చెబుదామనుకున్నాడుగానీ సిగ్గుపడి ఊరు కున్నాడు.

అందమైన మనమడ్ని ఒళ్ళో ఉంచు కుని ఫోటో తీయించుకోవాలని మహ సరదాగా ఉంది సత్యభామకి. మనమడికి ప్పుడు పదో నెల. తన కొడుకు [illegible]ేళ్ళ వాడయి పోయాడు కనుక, వాడ్ని ఒళ్ళో కూచోపెట్టుకోడం ఎబ్బెట్టుగా ఉంటుం ది కనక, తన కోరిక తీరాలంటే ఆ పాల బుగ్గల పసిడి రంగుల మనమడ్ని పట్టు చీర కట్టుకున్న తన ఒళ్ళో కూచోపెట్టు కుని, రంగు రంగుల ఫోటో తీయించు కోవాల్సిందే.

మనమడంటే కూతురు కొడుకు. వాడ్ని అమ్మమ్మ చేరదీసింది. అసలుకన్నా వడ్డీ ముద్దన్న సామెత ఆ మనమడికీ ఆ అమ్మమ్మకీ వర్తిస్తుంది. చెట్టు మీద జాంపండులాగా, టేబిలు మీద [illegible]ండు లాగా అమ్మమ్మ చంకలో కూచు[illegible]ందరినీ నవ్వి స్తాడు, కవ్విస్తాడు ఆ మనమడు.

మనమడి పేరు కృష్ణ కిశోర్. "సత్యభామ ఒళ్ళో కృష్ణకిశోర్'' ఫోటో ఎప్పుడు తీయిద్దాం. రెడీగా ఉండండి, సాయంకాలం కృష్ణా స్టూడియో కెడదాం. మనమడి గిరజాలూ అమ్మమ్మ పట్టు చీరా బాగా రావాలి'' అంటూ రంగనాథ్ హెచ్చరించి ఆఫీసుకెళ్ళి పోయాడు.

సత్యభామ పట్టుచీర పైకి తీసి ఇస్త్రీ చేయించు కుంది. మనమడికి ఆకుపచ్చరంగు డ్రెస్సు సెలక్టు చేసింది నాళ్లమ్మ. 'కృష్ణకిశోర్ ఫోటో తీయించు కుంటాడు' అంటూ బుగ్గ నిదుముతూ నాళ్లమ్మ ఉషాబాల మురిసిపోతూ డ్రెస్సు వేసింది. ఉషాబాల ఎర్రని నైలక్సు చీర సెలక్టు చేసుకుంది. సత్యభామ పట్టుచీర స్కై బ్లూ కలర్‌లో ఉంది.

సాయంకాలం నాలుగ్గంటల దాకా ఫోటో గురించే ముచ్చటించుకున్నారు తల్లీకూతురూ. రంగనాథ్

మిరియాల రామకృష్ణ

రిక్షాలెక్కబోయే ముందు, ఉషాబాల మళ్లీ మేడ మీదికి వెళ్లి ఏదో మరిచి పోయిన వస్తువు తెచ్చు కొచ్చింది. అదేమిటో సత్యభామ పట్టించుకోలేదు.

రిక్షాలో సత్యభామా రంగనాథ్ కూచున్నారు. మరో రిక్షాలో ఉషాబాల, తమ్ముడు సుధాకర్ కూర్చున్నారు. కృష్ణకిశోర్ సత్యభామ ఒళ్లోనే కూచున్నాడు. రంగనాథ్ తాజా సువాసనలకూ పట్టు చీర కట్టిన తీరుకీ మైమరిచి పోయాడు.

కృష్ణ స్టూడియో దగ్గర రిక్షా లాగాయి. రిక్షా లోంచి ముందు ఉషాబాల సుధాకర్ దిగారు. ఉషాబాల వచ్చి కొడుకునందుకుంది. సత్యభామ నెమ్మదిగా దిగింది. రంగనాథ్ స్టూడియో బోర్డు కేసి చూస్తూ దిగాడు.

స్టూడియో మేడ మీదుంది. ఇరుకు మెట్లు, నిచ్చెన ఎక్కుతున్నట్లుగా ఎక్కాలి. ఇటు అటూ పట్టుకోడాని కేమీ ఉండదు. బేలన్సు కాపాడుకోవాలి.

ఉషాబాల కృష్ణకిశోర్‌ను చంకనేసుకుని మెట్లె క్కింది. సత్యభామ సుధాకర్ చేయి పట్టుకుని పైకె క్కించింది.

స్టూడియో అంతా కిక్కిరిసి ఉంది. "ఈ రంగుల ఫోటోలొచ్చాకా గిరాకీ ఎక్కువయింది. ఫోటోకి ముప్ఫయి నుంచి నూట యిరవై దాకా వసూలు చేస్తారు. ఎన్ని ఫోటోలు కావాలి మనకి?" అన్నాడు రంగనాథ్ పెళ్లాం చెవిలో.

"ఎప్పుడూ మీకు డబ్బుల బాధే. నా దగ్గర కొచ్చే సరికి ఎక్కడ లేని పొదుపూ ఒలకబోస్తారు?" అంటూ సత్యభామ సణుక్కుంది. ఇక మర్యాదగా ఉండదని రంగనాథ్ నోరు మూసుకున్నాడు. "బాబుకి ప్రత్యే కంగా ఒకటి. మనందరికీ ఒకటి. సరేనా?" అన్నాడు. సత్యభామ మౌనం అర్ధాంగీకారం అయింది. అర్ధాంగి కేసి చూసి రంగనాథ్ శృంగారంగా నవ్వాడు. సత్యభామ జడలో పువ్వులు ముందుకేసుకుంది.

స్టూడియో మానేజర్ముందు బాబుకి ఫోటో తీస్తా నన్నాడు. గబగబా సత్యభామ బాబుని తయారు చేసి, కూచో పెట్టింది. ఉషాబాల బాబు డ్రెస్సూ గిరజాలూ అన్నీ తడిమి సిద్ధం చేసింది. బాబుని నవ్విస్తూ ఫోటో తీశాడు ఫోటోగ్రాఫర్.

ఈ మాటు గ్రూపు ఫోటోకి అందరూ సిద్ధ మయ్యారు. సుధాకర్, ఉషాబాల నిలబడ్డారు. సత్యభామ ఒళ్లో బాబు! రంగనాథ్ కాలు మీద కాలేసు క్కూచున్నాడు. ఫోటోగ్రాఫర్ రంగనాథ్ నాచీని పైకి పెట్టుకోమన్నాడు. ఉషాబాల మొహం కిందికి దించ మన్నాడు. సుధాకర్‌ను నవ్వమన్నాడు. సత్యభామ ను తల పైకెత్తమన్నాడు. సత్యభామ ఠీవీగా తల పై కెత్తింది. కాటుక కళ్లలోంచి కెమెరా వైపు చూపులు ప్రసరిస్తోంది.

ఇంతలోనే ఫోటో తీసేశానంటూ థాంక్సు చెప్పాడు ఫోటోగ్రాఫర్. అద్భుతంగా వందరూపాయలిచ్చేశాడు. రంగనాథ్. కౌంటర్‌లో అమ్మాయి రసీదుని సత్య భామ కందజేసింది. సత్యభామ రంగనాథ్ జేబులో ఆ రసీదును మడిచి తోసేసింది.

పదిచి పోదామన్నాడు సుధాకర్. బాబు నెత్తుకుని నడవలేనంది ఉషాబాల. సత్యభామకీ ఉషాబాలకీ ఒక రిక్షా కుదిర్చాడు రంగనాథ్. "మీరు షికార్లు కొట్టి వస్తారా? వీల్లేదు. వచ్చేయండి మరో రిక్షా మీద" అంది సత్యభామ.

అంతా ఇంటికి కలిసే వచ్చారు. రాత్రి ఉషాబాల సరిగ్గా నిద్రపోలేదు. బాబు ఏడుస్తూనే ఉన్నాడు. సత్యభామ హాయిగా నిద్ర పోయింది. రంగనాథ్ రాత్రి 12 గంటలదాకా 'ఫ్రంట్ లైన్' చదువుకుని వచ్చి జాజిపూల కేసి జాలిగా చూస్తూ పడుకున్నాడు.

మర్నాడు ఉషాబాల ఏదో పోయిన వస్తువు కోసం వెదుకుతూంటే సత్యభామ చీపురుతో ఊడుస్తూ 'ఏమటమ్మాయి వెదుకుతున్నావ్' అంది. "కాదమ్మా! నిన్న బాబు ఫోటోకని మామయ్య యిచ్చిన బుల్లి ఉంగరం తొడిగాను. అది కనిపించడం లేదు" అని ఏడుస్తూ చెప్పింది.

"ఉంగరం తగిలించావా? అందుకా రిక్షా ఎక్కడానికి ముందు మళ్లీ పైకెళ్లావ్?" అన్నాడు రంగనాథ్.

"పోనీలెండి. మీరేమీ బాధపడకండి. ప్రాప్తం లేదు" అంది ఉషాబాల. "అదేమిటే? దాని ఖరీదు రెండు వందలుండదూ?" అంది సత్యభామ. "పుట్టింటి కొచ్చి ఉంగరం పారేసుకుంటే అది మనమే మళ్లీ చేయించి పెట్టాలి. అసలు స్టూడియోలో పడిపోయిం దేమో కనుక్కుని రండి" అని ఆజ్ఞ జారీ చేసింది సత్యభామ. రంగనాథ్ స్టూడియోకి ఫోన్ చేశాడు. ఆ ఉంగరం సంగతేమీ తమకు తెలియదండి కౌంటర్‌లో అమ్మాయి గొంతు.

"పోనీ లెండి! మీరు వెంటనే బంగారు కొట్టుకెళ్ళి అలాంటి చిన్న ముత్యంగరం కొని తెండి. అల్లుడొచ్చే లోగానే ఇది జరగాలి" అంది సత్యభామ రంగనాథ్‌కేసి చూస్తూ.

రంగనాథ్ "సాయంకాలం వెడతాను లేవోయ్. ఇవాళ ఎరియర్సు వస్తాయిగా" అన్నాడు

ఆ సాయంకాలం "మంజూషా జ్యూయలర్స్"కు వెళ్లాడు రంగనాథ్. "ముత్యంగరాలున్నాయా? ఎంతవు తుంది" అన్నాడు.

మంజూషా జ్యూయలర్స్ వారు రంగనాథ్‌కు ఒక ముత్యంగరం చూపించారు. దాని ఖరీదు రెండు వందలన్నారు.

ఆ ఉంగరం పరిశీలనగా చూశాడు రంగనాథ్. అది కొంచెం పాత బడినట్టు, మట్టిలో దొర్లినట్లు కనిపిం చింది. సొట్టలు కూడా ఉన్నాయి.

"ఏమండీ ఇది ఇలా వాడిన ఉంగరం లాగా ఉంది!" అన్నాడు షాపు యజమానితో. "మీకింకోటి ఇస్తాం లెండి" అంటూ మరో కొత్త ఉంగరం తీయించి చూపించాడు యజమాని.

రంగనాథ్ ఆ ఉంగరానికిముత్యం వేయించాలన్నాడు. "అదెంత పనండీ! మరో పది రూపాయలవుతుంది" అన్నాడు యజమాని.

అరగంటలో ముత్యాల ఉంగరం ముద్దుగా బంగా రంలా తళతళలాడుతూ రంగనాథ్ చేతి కొచ్చింది.

తన మనమడి చేతి నుంచి జారి పోయిన ఉంగరం షాపులో కొచ్చేసి ఉంటుందని రంగనాథ్ అనుమానించి నా, మాట్లాడ లేక పోయాడు.

ముత్యపుటుంగరంతో వచ్చిన రంగనాథ్‌ను చూడ గానే సత్యభామ మురిసిపోయింది. కృష్ణకిశోర్ వేలికి ఉంగరం తొడిగింది. 'ఏమండీ మంచినీళ్ళు కావాలా?' అంది సత్యభామ రంగనాథ్‌తో.

"కాదు! మంచి పాలు కావాలి" అన్నాడు రంగనాథ్. ముందు మంచినీళ్లు తాగి, స్టూడియోకెళ్లి రంగుల ఫోటో తెండి! మీకు మంచి పాలు ఇస్తాను. మనమడికీ మీకూ పాలే మంచివి" అంటూ సత్యభామ వంటిం ట్లోకి వెళ్లి పోయింది.

స్టూడియో వాడు ఫోటోలనింటికే పంపేశాడు. ఉషాబాల ఆ ఫోటోలు చూస్తూ "బాబు వేలికి ఉంగరం పడుతుందనుకున్నాను. ఫోటోలో పడలే దంటే రిక్షాలోంచి జారి పోయిందన్న మాట" అంది.

"పోనీలే అమ్మా! ఈ మాటు ముత్యాల ఉంగరం తొడిగి మీ ఆయనా నువ్వూ బాబూ ఫోటో తీయించు కోండి. బాగుంటుంది" అన్నాడు రంగనాథ్.

"ఈ ఫోటో ఎంత బావుందో!" అంటూ సత్య భామ ఫోటోను ముద్దాడి 'టి.వీ.మీద ఫ్రేములో పెట్టండి దీన్ని' అని భర్తగారిని ఆజ్ఞాపించి, పాలు తేవడానికి లోపలికి పరుగెత్తింది.

